www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 26 ఏప్రిల్ 2025
5
వైఎస్ఆర్

రేపటి నుంచి ఉచిత వేసవి శిబిరం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉర్దూ భాషాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి జూన్ 5 వరకు ఉర్దూ ఉచిత వేసవి శిబిరం నిర్వహించనున్నట్లు అంజుమన్ ప్రెసిడెంట్ సత్తార్ ఫైజి, జనరల్ సెక్రటరీ హిదాయతుల్లా ముస్లిం మైనార్టీ నాయకులు నజీర్ అహ్మద్, జిలాని బాష పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం అంజుమన్ కార్యాలయంలో ఉర్దూ ఫ్రీ కోచింగ్ తెలుగు, ఉర్దూ కర పత్రాలు ఆవిష్కరించారు. 10 నుంచి 60 ఏళ్ల వయస్సు కల్గి ఆసక్తి, అభిరుచి ఉన్న వారు శిబిరంలో చేరవచ్చన్నారు. కడప నగరంలోని చిలకబావి దగ్గర ఉన్న క్రిసెంట్ స్కూల్లో రోజూ ఉదయం 9 నుంచి 11.30.వరకు ఉచిత తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎటువంటి ఫీజు లేదని పేర్కొన్నారు. ఉర్దూ భాష నేర్చుకోవాలని తపన ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తులు అదే రోజు పూర్తి చేయాలని కోరారు.

విద్యార్థులను మార్కుల యంత్రాలుగా మార్చకండి

- ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు లక్ష్మీరాజా

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీరాజా

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థులను మార్కుల యంత్రాలుగా మార్చవద్దని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, ఎస్వి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వీర సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎస్.వి ఇంజినీరింగ్ కళాశాలలో 'విద్యార్థులు-మార్కుల యంత్రాలు -విలువలు' అనే అంశం మీద ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు బి.లక్ష్మీరాజా అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకురాలిపై ఓ విద్యార్థి చెప్పుతో దాడి చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత విద్యార్థుల తల్లిదండ్రుల పైన, సమాజం పైన ఉపాధ్యాయ, అధ్యాపకుల పైన ఉందని తెలిపారు. విద్యార్థులను మార్కుల యంత్రాలుగా చూడటం, తయారు చేయటం వల్ల ఈ సమాజానికి, ఈ దేశానికి ఉపయోగం ఉండదన్నారు. సమాజ మార్పు కోసం, జరుగుతున్న పరిణామాలను అర్థం చేసుకుని సమ సమాజం నిర్మించుటలో విద్యార్థుల కీలకపాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల అభ్యున్నతి కోసం తల్లిదండ్రుల తర్వాత గురువు నిరంతరం శ్రమిస్తాడు అన్నది నగ్న సత్యం అన్నారు. ఇటీవల కాలంలో స్వల్ప దండనలకు కూడా విద్యార్థుల తల్లిదండ్రులు జోక్యం చేసుకుని గురువులపై దాడులకు తెగబడమనేది సమాజాన్ని అట్టడుగుకు తీసుకు వెళ్లేలా కనిపిస్తుందన్నారు. విద్యార్థుల బోధనాంశాలలో నీతి కథలు, మారల్ పీరియడ్స్ లాంగ్వేజ్ లలో విద్యార్థుల నిజ జీవితానికి అవసరమైన పాఠ్యాంశాలు లేకపోవడం ప్రస్తుత విద్యా వ్యవస్థలో ఒక లోపంగా కనిపిస్తుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు విద్యార్థుల పైన ఎలాంటి ద్వేషంతో శత్రుత్వంతో కానీ ఉండదని వారిని సరైన మార్గంలో నడపాలి అన్నదే గురువుల లక్ష్యంగా పనిచేస్తారు తప్ప మరో ప్రయోజనం వారి నుంచి కోరుకోరని తెలిపారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, ఎపిటిఎఫ్1938 జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ డి.కృష్ణారెడ్డి, ఎపిటిఎఫ్257 నాయకులు నరసింహులు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవి మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థులకు అన్ని స్థాయిలలో సదస్సులు నిర్వహించి వారిలో సామాజిక చైతన్యాన్ని, పెద్దలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పట్ల గౌరవాన్ని పాఠశాల స్థాయి నుంచి పెంపొందించేలా కృషి చేస్తామని తెలిపారు.

వేసవిలో నీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

వేసవిలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి కొరత రాకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత నీటిపారుదల ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో వేసవిలో తాగునీటి అవసరాలను తీర్చే ఏర్పాట్ల సన్నద్ధతపై సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని రానున్న రెండు నెలలు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో తాగునీటి కొరత రాకుండా ప్రత్యేక, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా కడప నగరానికి తాగునీటి అవసరాలను దృష్టిలో కొరత లేకుండా మైలవరం ప్రాజెక్టు ద్వారా ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్ద నీటిని నిలిచేసే పొదుపుగా వాడుకునే చర్యలు చేపట్టాలన్నారు. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రాంతాలకు ఎలాంటి కొరత లేకుండా తాగునీటి సదుపాయం, అలాగే గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు నీటి కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. మే నాటికి పులివెందుల పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని ప్రాంతాల్లో సమృద్ధిగా తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న తాగునీటి సరఫరా పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవం చేసేలా దృష్టి సారించాలన్నారు. అందుకు సంబంధించి చేపట్టాల్సిన పనులకు ఇంకా ఎవైనా అవసరం అయితే ప్రతిపాదనలను అందజేసి ప్రాధాన్యత వారీగా పనులను పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా అధిక నీటి ఎద్దడి పరిస్థితులు లేకపోయినప్పటికీ ఈ వేసవిలో అన్ని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు సరిపడా ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు సంబంధించి ప్రణాళికలను రూపొందించాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలతో పాటు రూరల్ ప్రాంతాల్లో ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జల్ జీవన్ మిషన్ ద్వారా చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి పులివెందుల మున్సిపాలిటీకి తాగునీరందించే పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అన్ని ప్రాజెక్టుల ఇంజినీరింగ్ అధికారులు, ఎపిఎస్‌పిడిసిఎల్ ఆర్ డబ్ల్యుఎస్, పబ్లిక్ హెల్త్, ఆర్ అండ్ బి, మున్సిపల్ కమిషనర్లు, పబ్లిక్ హెల్త్ అధికారులు పాల్గొన్నారు.

అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

మేయర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- మేయర్ సురేష్ బాబుకు వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) నాయకులు కోరారు. శుక్రవారం మేయర్ సురేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ భాస్కర్, కోశాధికారి గోపి మాట్లాడుతూ వయస్సు రీత్యా మున్సిపల్ కార్మికులను కూటమి ప్రభుత్వం తొలగిస్తూ ఉందని చెప్పారు. గత సమ్మెలో భాగంగా అప్పుడు ఆర్థిక శాఖలో జీవోలు పెండ్డింగ్‌లో ఉన్నాయని, వాటిని విడుదల చేస్తే కార్మికులకు న్యాయం లభిస్తుందని తెలిపారు. 35 సంవత్సరాల నుంచి పని చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేసిన కార్మికులు ఖాళీ చేతులతో ఇంటికి వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. జనరల్ బాడీ సమావేశంలో చర్చించి కార్మికుడికి రిటైర్డ్ మెంట్ బెనిఫిట్స్ ఫిక్స్ చేసి ఇస్తే భవిష్యత్తులో అందరి కార్మికుల కుటుంబాలకు ప్రయోజనం ఉంటుందని చెప్పారు. అనంతపురం జిల్లాలో మాదిరిగా 60 సంవత్సరాలు నిండిన వారికీ, వారి కుటుంబంలో ఒకరికి ఆప్కాస్ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఇంజినీరింగ్ కార్మికులకు జీవో నంబర్ 36 అమలు చేసి వారికి రూ.24,500 వేతనం ఇవ్వాలని పేర్కొన్నారు. స్పందించిన మేయర్ కార్మికుల కు తాము ఎప్పుడూ న్యాయం చేయడానికి ముందు ఉంటామని తెలిపారు. 2017లో రాష్ట్రంలో ఎక్కడ చేయకున్నా కడపలో కార్మికులకు న్యాయం చేశామని చెప్పారు. జనరల్ బాడీ ఎప్పుడు జరిగితే అప్పుడు మేము కచ్చితంగా చర్చించి కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి ఆనందరావు, పర్మినెంట్ నాయకులు కొండయ్య పాల్గొన్నారు.

దళితులకు భూమి ఇప్పించండి

ప్రజాశక్తి-కాశినాయన

తహశీల్దార్‌కు సమస్యను విన్నవిస్తున్న నాయకులు

వడ్డమాను గ్రామానికి చెందిన దళితుల భూమిని కొందరు అగ్ర కులాలకు చెందిన వారు ఆక్రమించారని, వారి నుంచి స్వాధీనం చేసుకుని దళితులకు ఇప్పించాలని ఎపి దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి ఎల్లయ్య కోరారు. శుక్రవారం ఆయన తహశీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని వడ్డమాను గ్రామానికి చెందిన ఈరి పుల్లమ్మ, ఆమె చెల్లెలుకు సంబంధించి సావిశెట్టి పల్లె పొలంలో సర్వేనెంబర్ 567లో మూడు ఎకరాల ఆరు సెంట్లు భూమి ఉందన్నారు. ఈ భూమి వారి తండ్రి అయిన బాల గురయ్యాకు 1961లో ప్రభుత్వం పట్టా ఇచ్చిందని చెప్పారు. ఆయన మరణాంతరం ముగ్గురు కుమార్తెలకు చెందాల్సిన భూమిలో ఎకరా 56 సెంట్లు అదే గ్రామానికి చెందిన మురికి సుబ్బారెడ్డి కుమారుడు రామచంద్రారెడ్డి అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నాడని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు ఏ విధంగా ఆన్‌లైన్ చేశారో పూర్తిస్థాయిలో విచారించాలని ఆయన తహశీల్దార్‌ను కోరారు. దళితులను మోసం చేసి బదలాయింపు నిషేధం చట్టం 1977, సవరణ చట్టం 2005 పిఓటి అనుసరించి మురికోటి రామ చంద్రారెడ్డి పేరు ఆన్‌లైన్ నుంచి తొలగించాలని, అక్రమానికి పాల్పడి నందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వెంటనే బాధితులకు భూమిని దళితులకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులు కష్టపడి, ఇష్టపడి చదవాలి

ప్రజాశక్తి - వేంపల్లె : విద్యార్థులు ఉన్నత స్థాయిలోకి చేయాలంటే కష్టపడి, ఇష్టపడి చదవాలని ప్రయివేటు పాఠశాలల జెఎసి రాష్ట్ర చైర్మన్ లెక్కల జోగిరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం వేంపల్లెలోని శ్రీనివాస పాఠశాల వార్షికోత్సవ వేడుకలను కరస్పాండెంట్ పాలగిరి కేశవులు, డైరెక్టర్ పాలగిరి చంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితంలో రాణించాలంటే చదువు ఒక్కటే మార్గమన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించి పాఠశాలకు మంచి గుర్తింపు తేవాలని కోరారు. పదోతరగతి పరీక్ష ఫలితాల్లో కూడా శ్రీనివాస స్కూల్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడం హర్షణీయం అన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి మంచి విజయాలు సాధించాలని కోరారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ కేశవులు మాట్లాడుతూ పేద పిల్లలకు నామమాత్రపు ఫీజుతో అత్యంత నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. పదవ తరగతి ఫలితాలలో స్కూల్ టాపర్ లకు నిలిచిన అరవింద్‌రెడ్డికి ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థిని విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతో పాటు విద్యార్థులకు మార్కుల మెమోలు అందజేశారు. కార్యక్ర మంలో డైరెక్టర్ పాలగిరి చంద్రబాబు, ఎంఇఒలు జాఫర్ సాదిక్, స్టాలిన్, దేవస్థానం చైర్మన్ సింగారెడ్డి జయచంద్రారెడ్డి, ట్రిపుల్ ఐటి అసిస్టెంట్ ప్రొఫెసర్ గోవింద తివారీ, కార్తీక్ రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్ : డిప్యూటీ స్పీకర్ రఘురాం కృష్ణంరాజు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని ఆ పార్టీ నగర కార్యదర్శి రామమోహన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరుపేదల ఇళ్లను కూల్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నానని ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు అనుకోవడం సిగ్గుచేటని తెలిపారు. నిరుపేదలు కేవలం రెండు సెంట్లు స్థలాన్ని ఆక్రమించి ఇళ్లను నిర్మించుకుంటుంటే అదేదో మహా పాపం అన్నట్లు వాటిని కూలదోస్తున్నారని, కానీ బడాబాబులు ఎకరాలలో స్థలాలను ఆక్రమించుకున్నా పట్టించుకోవట్లేదని పేర్కొన్నారు. ఉండి గణపవరం రహదారిలోని రొయ్యవలపు కేంద్రం వద్ద పంట బోదెను పూడ్చి పెద్దపెద్ద నిర్మాణాలు చేసినప్పటికీ వాటిని పట్టించుకున్న పాపాన పోలేదని తెలిపారు. పది ఎకరాల తూము సమీపంలో బడాబాబులు స్థలాలను ఆక్రమించుకుని షెడ్లు వేశారని, దమ్ముంటే వాటిని పడగొట్ట గలరా అని పేర్కొన్నారు. సిపిఎం కేవలం ప్రజా పక్షాన మాత్రమే పోరాడుతుందని, ప్రజలకు అన్యాయం చేసే వారు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా నిలదీయగల పార్టీ అని తెలిపారు. పాలకోడేరులో భూస్వాముల అధీనంలో ఉన్న భూములను వదిలేసి నిరుపేదల ఇళ్లను కూల్చడం దుర్మార్గమని పేర్కొన్నారు. రఘురామ కృష్ణంరాజు దుర్మార్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి నిరుపేదలకు న్యాయం చేసేందుకు వచ్చిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆయన మూర్ఖత్వానికి నిదర్శనమని తెలిపారు. వెంటనే శ్రీనివాసరావుకు రఘురామ కృష్ణంరాజు క్షమాపణలు చెప్పి ఆయన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని పేర్కొన్నారు. డిప్యూటీ స్పీకర్‌గా ఉండి బెదిరిస్తే భయపడే వ్యక్తులు సిపిఎంలో ఉండరని ,ఈ విషయాన్ని ఆయన గమనంలో ఉంచుకోవాలని తెలిపారు. తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు.

ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి - కడపఅర్బన్

కడప నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి ద్వారకా నగర్‌లోని తన నివాసంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రజల నుంచి అందుకున్న సమస్యల వినతులను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు బదలాయించారు. ముందుగా 43వ డివిజన్‌లో మన కడప-స్వచ్ఛ కడప కార్యక్రమాన్ని నిర్వహించి, మురుగు కాలువలు, అపరిశుభ్రతలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మురుగు కాలువల్లో అపరిశుభ్రతలను తొలగించాలన్నారు. పరిశుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందని పేర్కొన్నారు. కాలువల్లో చెత్త, చెదారాలు వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ శానిటేషన్ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిని దర్శించుకున్న అడిషనల్ డైరెక్టర్

ప్రజాశక్తి - బ్రహ్మంగారి మఠం : శ్రీ జగద్గురు మధిర పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామిని శుక్రవారం ఢిల్లీకి చెందిన అడిషనల్ డైరెక్టర్ సుభాష్ చంద్ర మాలిక్, జడ్ఒ హరిస్వర, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారిని దర్శించుకున్నారు. మఠం ఆలయ నిర్వాహకులు సంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. స్వామివారి వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్ర మంలో మండల డిప్యూటీ తహశీల్దార్ జాన్సన్, విఆర్ఒ సుధాకర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

ప్రజాశక్తి -కమలాపురం టౌన్ : మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. ముందుగా ఆర్ఎస్ రోడ్డు నుంచి బస్టాండ్ వరకు రూ. 77 లక్షలతో నిర్మించబోయే సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. పక్కిరివాండ్లవీధిలో ఎన్‌టిఆర్ సుజల స్రవంతి తాగునీటి పథకం పైప్‌లైన్‌కు పూమి పూజ చేశారు. నగర పంచాయతీలో చెత్తను తీసుకెళ్లే నూతన వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మండల సాధారణ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రతి పంచాయతీలో తాగునీరు కొరత లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో మురుగునీరు రోడ్లపై రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. మురుగు కాల్వలు లేని ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. పార్టీలకు అతీతంగా సర్పంచులు, జడ్‌పిటిసిలు పంచాయతీల అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సిరిగిరెడ్డి రాఘవరెడ్డి, కమలాపురం నగర అధ్యక్షులు, దివాకర్ రెడ్డి, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఖాదర్‌బాషా, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు పుత్తా ఎల్లారెడ్డి, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు చాపాడు ప్రభాకర్ రెడ్డి మండల తెలుగు యువత అధ్యక్షుడు ఎర్రబల్లి సుబ్బారెడ్డి, దాదిరామయ్య పరంధామ రెడ్డి రఘురామిరెడ్డి పాలగిరి సుబ్బారెడ్డి విభరాపురం రాఘవరెడ్డి, రాజుపాలెం సుధాకర్ రెడ్డి, బిసి జిల్లా ఉపాధ్యక్షులు శంకర్ యాదవ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు .

మలేరియా నివారణకు కృషి

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలో మలేరియా నిర్మూలనకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. అనంతరంవైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2027 నాటికి మలేరియా కేసులు లేకుండా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. గతంతో పోలిస్తే మలేరియా కేసులు తగ్గుముఖం పడుతున్నాయని చెప్పారు. ప్రతి శుక్రవారం ప్రజలు డ్రైడే పాటించాలని కోరారు. దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మలేరియా వ్యాధిపై అవగాహన కొరకు విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం, ఉపన్యాస, మౌఖిక పరీక్షల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిర్ధారణ అధికారి డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, మలేరియా అధికారి మనోరమ, డి ఎల్ పి ఓ విజయభాస్కర్, రమేష్ రెడ్డి, వెంకటరెడ్డి, ఖాజా మొహిదీన్, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెబ్ సైట్‌లో సీనియారిటీ జాబితా

ప్రజాశక్తి - కడప అర్బన్ : జోన్-4 పరిధిలోని అనంతపురం, చిత్తూరు, కడప , కర్నూల్ పూర్వపు జిల్లాలలోని స్కూల్ అసిస్టెంట్ నుంచి గ్రేడ్ -2 ప్రధానోపాధ్యాయ పోస్టుకు సీనియార్టీ జాబితాను వెబ్ సైట్‌లో ఉంచినట్లు ఆర్‌జెడి కె. సామ్యుయేలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సీనియార్టీ జాబితా పరిశీలించుకోవాలని తెలిపారు. డిఇఒలు తమ వెబ్‌సైట్‌లో ప్రకటించాలని పేర్కొన్నారు.

కేసుల పరిష్కారంలో
అందరి సహకారం అవసరం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని
- బార్ అసోసియేషన్, న్యాయవాదులు అందించిన సహకారం ఎన్నటికీ మరువలేం
- బదిలీపై వెళుతున్న జడ్జిలు జె.నందిని, జె.హేమ స్రవంతి, భార్గవి

బదిలీ అవుతున్న జడ్జీలను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి - కడప

కేసుల పరిష్కారంలో కడప బార్ అసోసియేషన్, సభ్యులు, న్యాయవాదులు అందరి సహకారం ఎంతో అవసరమని నూతనంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సి. యామిని అన్నారు. కడప కోర్టులో మొదటి అదనపు జిల్లా మేజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న జె.నందిని, ఎక్సైజ్ కోర్టు జడ్జిగా పనిచేస్తున్న జె.హేమ స్రవంతి, రెండవ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ గా పని చేస్తున్న భార్గవి బదిలీపై వెళుతున్న సందర్భంగా వారికి శుక్రవారం సాయంత్రం కడప బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ హాలులో వీడ్కోలు, సన్మాన సభ నిర్వహించారు. అలాగే జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సి. యామిని, ఫ్యామిలీ కోర్టు జడ్జిగా బాధ్యతలు చేపట్టిన ఎన్.శాంతికి స్వాగత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.వి. రాఘవరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. బదిలీపై వెళుతున్న జడ్జిలకు కడప అసోసియేషన్ తరపున ఘనంగా సత్కరించి. జ్ఞాపికలు అందజేసి వీడ్కోలు పలికారు. అలాగే జిల్లా ప్రధాన న్యాయమూర్తికి, ఫ్యామిలీ కోర్టు జడ్జికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.వి. రాఘవరెడ్డి మాట్లాడుతూ బదిలీపై వెళ్తున్న ముగ్గురు జడ్జిలు మూడేళ్లుగా కడప కోర్టులో మంచి గా న్యాయ సేవలు అందించారన్నారు. కేసుల పరిష్కార విషయంలో న్యాయవాదులకు సహకరించినందుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు ఆయన తెలియజేశారు. బదిలీపై జడ్జిలు మాట్లాడుతూ తాము కడప కోర్టులో పని చేసినంత కాలం త్వరితగతిన కేసులు పరిష్కరించేందుకు కడప బార్ అసోసియేషన్, సభ్యులు, న్యాయవాదులు అందించిన సహాయ సహకారులను ఎన్నటికీ మరువలేమన్నారు. కడపకు వచ్చిన తర్వాత చాలా విషయాలు తెలుసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కడప బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఏ. ఉమాదేవి ప్రధాన కార్యదర్శి చంద్ర వదన, కోశాధికారి సురేష్ కుమార్, అసోసియేషన్ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, మొదటి అదనపు జిల్లా జడ్జి ఎల్. వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రత్యూష కుమారి, సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఎ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్, జడ్జీలు పాల్గొన్నారు.

రైతులతో 'అల్ట్రాటెక్' చర్చలు

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

మండలంలోని దండుపల్లె, సిరాజ్ పల్లె, కర్చుకుంటపల్లెకు చెందిన రైతులతో శుక్రవారం ఆర్‌డిఒ సాయి శ్రీ, అల్ట్రాటెక్ ప్రతినిధులు ముఖాముఖి చర్చలు నిర్వహించారు. ఇటీవల చిలమకూరు అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ వివాదం జరుగుతున్న నేపథ్యంలో అల్ట్రాటెక్ క్వార్టర్స్ లోని క్లబ్ లో సుమారు 15 మంది రైతులతో చర్చలు నిర్వహించారు. పొల్యూషన్, తాగునీటి సమస్యలు అధికంగా ఉన్నాయని రైతులు అధికారుల దృష్టికి తెచ్చారు. భూములు కోల్పోయామని తమకు ఉపాధి లభించలేదని వారు పేర్కొన్నారు. బ్లాస్టింగ్ వల్ల భూములలో, ఇళ్ల పగులు వస్తున్నాయని చెప్పారు. అనంతరం 2200 ఎకరాలకు సంబంధించి వివాద భూములను వివాదం కూడా ఆర్‌డిఒ స్వయంగా పరిశీలించారు. సమీపంలోనున్న పంట పొలాల్లో కూడా సందర్శించారు. సమస్యలను అక్కడి రైతులను అడిగి తెలుసుకున్నారు.

చర్చిలపై దాడులు చేస్తే సహించం

ప్రజాశక్తి - కడప

చర్చిలపై దాడుల చేస్తే సహించబోమని న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్ పేర్కొన్నారు. కడప నగరం ఆర్‌అండ్‌బిగెస్ట్ హౌస్‌లో ప్రజా సంఘం నాయకుడు కిషోర్ అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ గతంలో తన చర్చిపై కూడా దాడులు జరిగాయని, చర్చికి వెళితే కుల బహిష్కరణ చేస్తామని భక్తులను భయభ్రాంతులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థించే పాస్టర్ల పై దాడులు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఆయా క్రైస్తవ అసోసియేషన్ల పెద్దలు మల్లెం విజయ భాస్కర్, శ్యాముల్ బాబు, పుల్లూరు శ్రీనివాసులు, షడ్రక్ రాజ్, డి.వి ప్రసాద్, డానియేలు అనేక మంది దైవ సేవకులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని కార్మికుడు మృతి

ప్రజాశక్తి - వేముల

మండలంలోని స్థానిక వేల్పుల మీదుగా వెళుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పనుల్లో గురువారం అర్ధరాత్రి టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో రాజా నాయక్(56) అనే కార్మికుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాలు ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన రాజా నాయక్ నెల రోజుల కిందట హైవే పనులకు కూలీగా వచ్చారు. గురువారం అర్ధరాత్రి హైవే పనులు జరుగుతున్న ప్రాంతంలో నిద్రిస్తుండగా టిప్పర్ డ్రైవర్ అతన్ని గమనించకుండా వాహనాన్ని రివర్స్ చేస్తూ నాయక్‌పై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని బామ్మర్ది బజియా నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

ఎస్ఆర్ఐటిలో బి.టెక్ ఫేర్‌వెల్ డే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మండలంలోని లింగాపురంలో ఉన్న సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం బి.టెక్ ఫైనలియర్ విద్యా, థర్డ్ ఇయర్ విద్యార్థులు వీడ్కోలు సమావేశం ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగన్ రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇప్పటి వరకు మీ జీవితం మీ తల్లితండ్రుల మీద ఆధారపడి కొనసాగిందని, ఇక మీదట మంచి ఉద్యోగాలు లేదా ఏదైనా ఇతర రంగములో నిలదొక్కవాలని అన్నారు. చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర రెడ్డి మాట్లాడుతూ సీనియర్లకు జూనియర్లు ఫెరెవెల్ డే నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని, ప్రతి ఒక్కరు మంచి స్థాయిలో స్థిరపడి కళాశాలకు, తల్లితండ్రులకు గౌరవం తెచ్చిపెట్టాలని అన్నారు. కరస్పాండెంట్ వీరకల్యాణ్ రెడ్డి మాట్లాడుతూ జీవితంలో ప్రతి ఫేర్‌వెల్ ఒక కొత్త ప్రారంభానికి ద్వారం అని, మీ భవిష్యత్తును మంచిగా మలుచుకోవాలని అన్నారు. వైస్ ప్రిన్సిపల్, హెచ్‌ఒడిలు మాట్లాడుతూ ఈ నాలుగు సంవత్సరాలలో మీకు వచ్చిన అవకాశాలు, మీరు ఎదుర్కొన్న సవాళ్లను బేరీజు వేసుకుంటూ ఉన్న స్థాయికి ఎదగాలని అన్నారు. అనంతరం సీనియర్లు జూనియర్లు నృత్యాలు, పాటలతో సందడి చేశారు.

ఉగ్రవాదాన్ని రూపుమాపాలి : సిఐటియు

ప్రజాశక్తి-కడప అర్బన్

పహల్గాం ప్రాంతాల్లో అతి కిరాతకంగా, దుర్మార్గంగా ఉగ్రవాదులు చంపేయడాన్ని దారుణమని సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారి మనోహర్, శ్రీనివాసులరెడ్డి, లక్ష్మీదేవి సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. పర్యాటకులను అతి కిరాతకంగా కాల్చివేయడం ఉగ్రవాదుల దుర్మార్గానికి అంతు లేదని తెలిపారు. ఇలాంటి ఉగ్రవాదులను ఏరివేయాలన్నారు. ఎలాంటి ఉగ్రవాదమైనా, ఎటువంటి వారైనా ఉపేక్షించాల్సినటువంటి అవసరం లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉగ్రవాదులను అణిచివేయడానికి గట్టి కృషి చేయాలని కోరారు.

నేడు ఉగ్రవాద దాడిని ఖండిస్తూ ర్యాలీ

జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదులు 26 మందిని కిరాతకంగా కాల్చిన సంఘటన దేశంలో అందరి హృదయాలను కలచివేసిందని, దేశంలోని ప్రజలందరూ ఈ సంఘటనను ముక్తకంఠంతో ఉగ్రవాదులపై పిడికిలి బిగించాల్సిన సమయం ఆసన్నమైందన్నాని ప్రజాసంఘాల ఐక్య వేదిక నాయకులు పేర్కొన్నారు. దాడిని ఖండిస్తూ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 26న సాయంత్రం ఐదు గంటలకు స్టేట్ గెస్ట్ హౌస్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు డాక్టర్ సి.ఓబుల్ రెడ్డి, డాక్టర్ రాజా వెంగల్ రెడ్డి, లక్ష్మీ రాజా, డాక్టర్ ఫరూక్, ఇలియాస్ బాషా, చంద్రశేఖర్, రవిశంకర్ రెడ్డి, రామ్మోహన్, మనోహర్, శ్రీనివాసులు రెడ్డి, లక్ష్మీదేవి, తస్లీమా, ప్రసాద్, డాక్టర్ శ్రీనివాసులు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ర్యాలీ కార్యక్రమంలో మేధావులు, అభ్యుదయవాదులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి

కడప : జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాంలో టూరిస్టులపై జరిగిన ఉగ్ర దాడి దుర్ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ సిగ్గుతో హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు కదిరి ప్రసాద్ గౌడ్ డిమాండ్ చేశారు. జమ్మూ కాశ్మీర్‌లోని పహల్ కామ్ లో టూరిస్టులపై జరిగిన ఉగ్రదాడి పిరికి పంద చర్య అని విమర్శించారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ దాడిలో 30 మంది చనిపోవడం, మరికొంత మంది గాయపడటం తనను తీవ్రంగా కలిచి వేసిందని తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. . **ఉగ్రదాడికి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ** పహల్గాంలో చోటుచేసుకున్న ఉగ్రదాడికి నిరసనగా కడప నగర గ్రామ వార్డు సచివాలయం ఎంప్లాయిస్ జిల్లా అధ్యక్షులు హీరా మియా ఆధ్వర్యంలో శుక్రవారం కడప నగరంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హీరా మియా మాట్లాడుతూ కాశ్మీర్‌లో జరిగిన ఉగ్ర దాడి చాలా బాధాకరం అని, ఇలాంటి దాడులు చేయడానికి కూడా భయపడేలా ఉగ్రవాదాన్ని అణిచి వేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కడప నగర అధ్యక్షులు హేమ సుందర్ రాజు, కమిటీ సభ్యులు కిరణ్‌కుమార్‌రెడ్డి, ఉదయ్, సురేష్ బాబు,ప్రసాద్, మనోరంజన్, సుధాకర్, మస్తాన్ వల్లి పాల్గొన్నారు. **వేముల :** మూడు రోజుల కిందట దేశంలోని జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం పహల్గాంలో పర్యాటకులపై పాకిస్తాన్ ఉగ్రవాదులు జరిపిన దాడిలో అమరులైన వారికి మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి,పేర్ల శేషారెడ్డి అధ్యక్షతన మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ నుంచి స్థానిక ఎపిజిబి వరకు కొవ్వొత్తుల నిరసన నిర్వహించారు. **దువ్వూరు :** మండల కేంద్రమైన స్థానిక మూడు రోడ్ల కూడలిలో హిందూ ముస్లింలు బాయ్ బాయ్ అంటూ మానవహారంగా ఏర్పడి ర్యాలీ నిర్వహించారు .

దువ్వూరు : ఉగ్రదాడికి నిరసనగా మానవహారం నిర్వహిస్తున్న ముస్లిములు

నేత్రదానంతో ఇద్దరి అంధులకు చూపు

కార్నియాలను అప్పగిస్తున్న మృతుని కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

నేత్రదానం ఇద్దరి అంధులకు చూపునిస్తుందని స్నేహిత సేవా సమితి అధ్యక్షుడు ముమ్మెల రాజు అన్నారు. శుక్రవారం పట్టణం జొన్న వెంకటయ్య వీధికి చెందిన విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు రెంటాల చిన్న పుల్లయ్య మరణించడంతో ఆయన భార్య వరదమ్మ, కుమారుడు పుల్లయ్య, కుమార్తె హరిత, కోడలు విజయ కుమారి, అల్లుడు శివ కుమార్ నేత్ర దానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు సమాచారం ఇచ్చారు. వారు టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతుని నివాసం వద్దకు వెళ్లి పార్థీవ దేహం నుండి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ మనిషి మరణానంతరం మట్టిలో కలిసి పోయే నేత్రాలను దానం చేసి అంధత్వంతో బాధ పడుతున్న అంధులకు చూపు ఇచ్చే బృహత్కార్యం కోసం ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలన్నారు. కుటుంబంలోని వ్యక్తి లేదా సన్నిహితులు మరణించిన 7093204537, 9966509364కు సమాచారం ఇచ్చి అంధ రోహిత నివారణ కోసం ప్రతి ఒక్కరు నేత్ర దానం చేసేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం లోని చలపతి, బంధువులు, సన్నిహితులు, సేవాసమితి బృందం కృతజ్ఞత అభినందనలు తెలిపారు.

రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యం వీడాలి

మే చివరి నాటికి రైతుల సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ : రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం చేయడం వల్ల రైతులు దీర్ఘ ఇబ్బందులు పడుతున్నారని, మే చివరినాటికి రైతుల భూ సమస్యలు పరిష్కరించకపోతే వారితో కలిసి ధర్నా చేస్తామని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో భూ సర్వే వల్ల చాలా మందికి వన్ బి, అడంగల్ రాకపోవడం వల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరగడం లేదన్నారు. బ్యాంకులలో రుణాలు కూడా పొందలేకపోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామని పేర్కొన్నారు. అధికారులు మాత్రం సదస్సుల్లో వచ్చిన సమస్యలను పరిష్కరించలేదన్నారు. చిన్న చిన్న సమస్యలే పరిష్కరించకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఈ సమస్యలు ఆర్‌డిఒ, జెసి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. తొండూరు, చక్రాయపేట తహశీల్దార్లు రైతుల సమస్య పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అధికారులు ఒక నెల జీతం ఆలస్యంగా వస్తే ప్రభుత్వాలపై ఆరోపణలు చేస్తున్నారని, కానీ రైతుల సమస్యలు సంవత్సరాల తరబడి ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో చెప్పాలన్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి రైతుల కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా వారి సమస్యలను పరిష్కరించాలన్నారు.

భూమి మార్పులను పరిశీలన

ప్రజాశక్తి - చాపాడు : మండల పరిధిలోని ఖాదరపల్లె గ్రామ సమీపంలో ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద శుక్రవారం వ్యవసాయేతర భూమి మార్పు కోసం తహశీల్దారు రామకుమారి పరిశీలించారు. నాగేశ్వరావు అనే రైతు తన 2.14 ఎకరాల వ్యవసాయ పొలాన్ని వ్యవసాయేతర భూమిగా మార్పు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు తహశీల్దారు రామకుమారి, శివశంకర్ రెడ్డి, విఆర్ఒ ఇస్మాయిల్‌లతో కలిసి భూమిని పరిశీలించారు. దీనిపై ఆర్‌డిఒ చర్యలు తీసుకోనున్నారు.

రైతులకు న్యాయం చేస్తాం : తహశీల్దార్

ప్రజాశక్తి - చాపాడు : నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం మంజూరు చేయించి తగు న్యాయం చేస్తామని తహశీల్దార్ పి. రమకుమారి తెలిపారు. శుక్రవారం సిద్ధారెడ్డిపల్లె, ద్వారకానగరం, జడ్జీగారి కొట్టాలు గ్రామాలకు చెందిన భూములు కోల్పోయి నష్టపరిహారం అందని రైతులు తహశీల్దార్‌ను కలిశారు. రోడ్డుకు భూములు కోల్పోయి రెండు సంవత్సరాలు అవుతున్నా నష్టపరిహారం అందలేదని బాధితులు పేర్కొన్నారు. రోడ్డును మాత్రం నిర్మిస్తున్నారని వెంటనే నష్టపరిహారం అందివ్వకపోతే పనులు నిలుపుదల చేస్తామని బాధితులు తెలియజేశారు. నెలలు తరబడి నివేదికలు నివేదికలు తయారు చేసి పంపుతామని చెబుతున్నారే తప్ప ఇంతవరకూ పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన తహశీల్దార్ రికార్డులను పరిశీలించి సాగులో ఉన్న రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు. రైతుల వద్ద ఉన్న వివరాలను సేకరించి తనకు వెంటనే పంపాలని సిబ్బందికి సూచించారు. వీలైనంత త్వరగా సిద్ధం చేసిన రైతుల వివరాలను తమకు అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రీసర్వే డిటి నారాయణ స్వామి, ఆర్ఐ శివశం కర్‌రెడ్డి, విఆర్ఒ సుబ్బన్న, రైతులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి- ఖాజీపేట : మండల పరిధిలోని పత్తూరు గ్రామానికి చెందిన పత్తూరు పంచాయతీ మాజీ సర్పంచ్, టిడిపి సీనియర్ నాయకులు సారె పిచ్చి నాయుడు(64) గత కొంతకాలంగా కేన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. ఇటీవలే హైదరాబాదులోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొంది స్వగ్రామానికి వచ్చారు. ఆరోగ్యం విషమించడంతో శుక్రవారం ఉదయం మృతి చెందాడు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. టిడిపి ఆవిర్భావం నుంచి అందులోనే కొనసాగుతూ పార్టీ అభివృద్ధి కోసం ఆయన ఎంతగానో కృషి చేశారు. ఆయన మృతి పట్ల టిడిపి నాయకులు, సన్నిహితులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా ఆయన పార్థవ దేహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - ఖాజీపేట : మండల పరిధిలోని పత్తూరు, పూసలకోట్టలు, రహమత్ ఖాన్‌పల్లె, డాంఖాన్‌పల్లె, పుల్లూరు, ఆంజనేయ కొట్టాల్ రోడ్డు ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలుపు దల చేయనున్నట్లు ఎఇ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ తీగలు సరి చేయడం, అదనపు స్తంభాల ఏర్పాటు చేయడం వంటి పనుల నిమిత్తమై సరఫరాను నిలిపేస్తామన్నారు. ఈ విషయం విద్యుత్ వినియోగదారులు ౖమనించాలని విజ్ఞప్తి చేశారు. ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు

'స్పందన' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు టౌన్ : స్పందన స్వచ్ఛంధ సంస్థ సేవలు అభినందనీయమని సేవా సంస్థల ఐక్యవేదిక అధ్యక్షులు డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి, కార్యదర్శి సి.వి. సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. స్పందన సంస్థఎన్నో సేవా కార్యక్రమాలకు నిలయమని పేర్కొన్నారు. సంస్థ వ్యవస్థాపకులు స్పందన సుబ్బరామిరెడ్డి సంతాప సభను ఆదివారం అరబిందో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. సుబ్బరామిరెడ్డి సేవా సంస్థలకు ప్రొద్దుటూరులో మొట్టమొదటిగా పునాది వేశారని చెప్పారు. ప్రజలంతా సంతాపసభకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేద్దాం

తొండూరు : మానవహారంగా ఏర్పడిన ఆశాకార్యకర్తలు, వైద్య సిబ్బంది

ప్రజాశక్తి- ముద్దనూరు

దోమ కాటు వల్ల సోకే ప్రాణాంతకమైన మలేరియా వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దామని పిహెచ్‌సి వైద్యాధికారులు శ్రీకాంత్, నాగార్జున అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ల్యాబ్ టెక్నీషియన్ జాసన్ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందితో 6వ వార్డులో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ మలేరియా వ్యాధిని శాశ్వతంగా నిర్మూలించేందుకు ప్రతి శుక్రవారమూ డ్రైడే పాటించాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా దోమ గుడ్డును పూర్తిగా నిర్మూలించేందుకు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. దోమ కాటుకు గురి కాకుండా దోమ తెరలు ఉపయోగించాలన్నారు. వేప ఆకు పొగ వేసుకుంటే దోమలు దరి చేరవన్నారు. పరిసరాలు అపరిశుభ్రతపై పంచాయతీ అధికారులకు తెలియజేయాలన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో అబేట్ ద్రావణం పిచికారీ చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ప్రసాద్ యాదవ్,ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, సూపర్ వైజర్లు శోభా కుమారి, రామారావు పాల్గొన్నారు. **తొండూరు :** స్థానిక డాక్టర్ ఆరిపుల్లా ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్ శాఖ మహిళా శిశు శంక్షేమ శాఖ, స్వయం సహాయక బృందాలతో కలిపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ వరకు మలే రియా అంతం మన పంతం, చిన్న దోమ పెద్ద ప్రమాదం, దోమతెర కట్టు దోవ ఎలను తరిమికొట్టు,లాంటి నినాదాలతో ర్యాలీ మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రేష్మా ,కమ్యూనిటీ ఆరోగ్య అధికారిని విజయ, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, సూపర్‌వైజర్ శశికళ ,ఆరోగ్య సిబ్బంది, ఇఒఆర్‌డి సాయిప్రతాప్ రెడ్డి, ప్రవీణ మహిళా పోలీసు,ఆరోగ్య కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు గ్రామ మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు. **చాపాడు :** మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని చాపాడు, కేతవరం గ్రామాలలో ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలను సమావేశ పరిచి ప్రపంచ మలేరియా దినోత్సవ సందర్భంగా సమావేశాలు ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రాజేష్ కుమార్, డాక్టర్ శ్రీవాణి నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్స్ కావ్య మాధురి, ఓబులేసు ఆధ్వర్యం పాల్గొన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ మహదేవ్ యాదవ్, ఆరోగ్యవిస్తరణ అధికారి యం రాఘవయ్య, సూపర్‌వైజర్లు బాబు రెడ్డి, ప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసీ అధికారి, స్టాఫ్ నర్స్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **వేంపల్లె :** మలేరియా వ్యాధిని నివారించేందుకు వైద్య ఆరోగ్య సిబ్బంది మలేరియా అంతం మనతోనే అంటూ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండలంలోని తాళ్ళపల్లె గ్రామంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పభుత్వ వైద్యులు పృధ్వీ కుమార్, హైల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా, సిహెచ్ఒ వెంకట రత్నం, ఎంపిహెచ్ఇఒ ఫకృద్దీన్, సూపర్ వైజర్ వెంకటలక్ష్మీ, అరుణాదేవి, అంకయ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరిండెంట్

ముద్దనూరు : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జమ్మలమడుగు రూరల్ : ర్యాలీలో వైద్యులు, వైద్య సిబ్బంది

డాక్టర్ రఫీక్ పాషా అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవ సందర్భంగా సూపరింటెండెంట్, సబ్ యూనిట్ ఆఫీసర్ నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఏరియా ఆసుపత్రి నందు వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజల సహకారంతో మలేరియా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, వైద్యసిబ్బంది, మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** మండలంలోని కామనూరు పిహెచ్‌సి పరిధిలో ఉన్న కామనూరు శంకరాపురం గోపవరం పెన్నానగర్‌లలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా డాక్టర్ హనీఫ్ బాబా, డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు మూడు రోజులుగా మలేరియాపై అవగాహన కార్యక్రమాలు గోపవరం – పొట్టిపాడు రోడ్డులో ఉన్న బాలుర సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్‌లో మలేరియాపై వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, సిహెచ్ఒ కృష్ణమ్మ, సూపర్‌వైజర్లు బి.ఎ. వరప్రసాద్, చంద్రకళ, ఫార్మసీ ఆఫీసర్ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ మధు, ల్యాబ్ టెక్నిసియన్ ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఎఎన్ఎంలు, ఒపి స్టాఫ్ పాల్గొన్నారు. **లింగాల :** దోమ కాటు వల్ల మలేరియా వ్యాధి వ్యాప్తి చెందుతుందని ప్రతి ఇంట్లో పరిశుభ్రత పాటించి మలేరియా వ్యాధి నివారణకు అందరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి సుభాషిణి అన్నారు ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆర్యోగ్య కేంద్రం నుంచి లింగాల బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు

మెప్పుకోసమే జగన్‌పై ఆరోపణలు

- ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మెప్పు కోసమే మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిపై ఆరోపణలు చేస్తున్నారని వైసిపి ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా పహల్గంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. అనంతరం ఆదినారాయణరెడ్డి కూటమికి అధిపతిలా ఉన్నట్లు వ్యవహరిస్తున్నారన్నారు. జగన్మోహన్‌రెడ్డిని శాశ్వతంగా రాజకీయాలకు దూరం చేస్తామని చెప్పడం హాస్యాస్పదమని వాపోయారు. ఆదినారాయణరెడ్డి వై.ఎస్. కుటుంబం భిక్షతోనే ఎమ్మెల్యే అయ్యారని, జగన్ బిఫార్మ్ ఇచ్చింటేనే ఎమ్మెల్యే అయ్యి టిడిపిలోకి దొడ్డిదారిన వెళ్లి మంత్రి పదవి చేపట్టారన్నారు. తన స్థాయిని మరిచిపోయి మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఒక అనకొండలా తయారయ్యారన్నారు. అక్రమ సంపాదన, దౌర్జన్యాలు, స్వార్థపూరితంగా వ్యవహరించడం చూసి జనాలు విసిగిపోయారని విమర్శించారు. కల్వటాల, పాపాయిపల్లెలో సోలార్ పనులను దౌర్జన్యంగా చేస్తూ అక్కడి రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఎక్కడ చూసినా దౌర్జన్యాలు ఎక్కువయ్యాయని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న రామసుబ్బారెడ్డి

ఏ కంపెనీల వద్ద చూసినా ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి మిషనరీలే పనిచేస్తున్నాయని దేవగుడి కుటుంబ సభ్యులే అన్ని పనులు చేసుకుంటున్నారని ఆరోపించారు. అధికారం అడ్డుపెట్టుకొని కంపెనీలకు వంత పాడుతున్నారని తెలిపారు. ప్రజలు కానీ, నాయకులు కానీ వారి అక్రమాలకు, దౌర్జన్యాలకు అడ్డు తగలకుండా ఉంటే ఫ్యాషన్, ప్రశ్నిస్తే ఫ్యాక్షనా అని ప్రశ్నించారు. ప్రజల పక్షాన నిలబడి పని చేయాలన్నారు. వీరి దౌర్జన్యాలకు కల్వటాల, పాపయపల్లె రైతులు, ప్రజలు నోరెత్తి మాట్లాడలేని స్థితిలో ఉన్నారన్నారు. ఇప్పటికైనా ఆదినారాయణరెడ్డి తన స్థాయి తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. సమావేశంలో గిరిధర్ రెడ్డి, నవాబుపేట శివ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థికి ఇన్నోవేషన్ అవార్డు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో బి.టెక్ ఇసిఇ తృతీయ సంవత్సరం విద్యార్థి కె.బాలస్వామిరెడ్డికి గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇన్నోవేషన్ అవార్డు అందజేసినట్లు ప్రిన్సిపల్ పాండు రంగన్ రవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపి స్టేట్ కౌన్సిల్ అఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్‌కు వరల్డ్ ఇంటలెక్చుల్ ప్రాపెర్టీ డే సందర్భంగా క్రియేషన్ ఆన్ హుమానాయిడ్ రోబోట్ కు గాను గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికగా ఇన్నోవేషన్ అవార్డు ప్రిన్సిపల్ ఇసిఇ పిహెచ్‌డి డాక్టర్ శివ సమక్షములో యూనివర్సిటీ వారిచే అవార్డును అందుకున్నారని చెప్పారు.ఈ సందర్భంగా చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్ రెడ్డి, కరస్పాడెంట్ వీరకళ్యాణ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.వెంకటేశ్వర రెడ్డి,హెచ్ఒడిలు,అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు.

రీ సర్వేతోనే భూముల స్వచ్ఛీకరణ

ప్రజాశక్తి- లింగాల: రీ సర్వే కార్యక్రమం ద్వారా భూముల స్వచ్ఛీకరణ జరుగుతుందని, అధికారులు అందరూ భాగస్వాములు కావాలని తహశీల్దారు ఈశ్వరయ్య అన్నారు. మండల పరిధిలోని చిన్నకూడల గ్రామం శుక్రవారం రీ సర్వే పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనం తరం ఆయన మాట్లాడుతూ వెబ్ ల్యాండ్ నమోదు అయిన వారు, మరణించిన వారి కుటుంబ సభ్యులు పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. భూ ములు కొనుగోలు చేసిన వారి నమోదులో మార్పులు, చేర్పులు అవకాశం ఉందని తెలిపారు. ఐదుగురు గ్రామ రెవెన్యూ అధికారుల ప్రత్యేక బృం దంగా నియమించామన్నారు అధికారులకు రైతులు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల సర్వేయరు పార్వతీ రైతులు పాల్గొన్నారు

సత్తా చాటిన 'విద్యాధరి' విద్యార్థులు

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు

ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో విద్యాధరి ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. 36 మంది పరీక్షకు హాజరు కాగా 33 మంది ఉత్తీర్ణులయ్యారు. వినయ్ 577 మార్కులు సాధించి ప్రథమ శ్రేణిలో నిలిచారు. మేఘన 562, సాయి 542 మార్కులతో ద్వితీయ, తృతీయ శ్రేణలో నిలిచారు. 8 మందికి 500పైగా మార్కులు వచ్చాయి. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ దేవి ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సాధారణ స్థాయి విద్యార్థులు అసాధారణ ప్రతిభ చూపారన్నారు. చదువు తరగని ఆస్తి అన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యం

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యార్థులు ఉన్నత స్థాయిలో రాణించాలంటే క్రమ శిక్షణ అనేది చాలా ముఖ్యమని సంఘమేశ్వర విద్యా సంస్థల కరస్పాండెంట్ సుబ్బనాయుడు పేర్కొన్నారు. వేంపల్లెలో శుక్రవారం సాయంత్రం రాఘవేంద్ర పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు లక్ష్యం అనేది ఉండాలని చెప్పారు. ప్రణాళిక బద్ధంగా విద్యార్థులు చదవాలని కోరారు. చెడు అలవాట్లుకు దూరంగా ఉండాలని చెప్పారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పిన విషయాలను ఎప్పటికప్పుడూ విద్యార్థులు నేర్చుకోవాలని కోరారు. అనంతరం ఎంఇఒలు జాఫర్ సాదిక్, స్టాలిన్ మాట్లాడుతూ రోజూ విద్యార్థి పాఠశాలకు క్రమ శిక్షణతో రావాలని కోరారు. రాఘవేంద్ర పాఠశాలను వేంపల్లె గ్రామంలో మొట్ట మొదటి ప్రారంభించారని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉన్న వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ప్రయివేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. పెద్దలకు, ఉపాధ్యాయులకు గౌరవం అనేది ఇచ్చినప్పుడే విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉంటారని చెప్పారు. అనంతరం ఒంటిగారి రామసుబ్బన్న విద్యా సంస్థల కరస్పాండెంట్ సుబ్బనాయుడుని, ఎంఇఒలను రాఘవేంద్ర పాఠశాల కరస్పాండెంట్ బోగరాజు ఘనంగా శాలువలతో సత్కరించారు. అనంతరం విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. సంస్కృతిక కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులను బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సబితా పర్వీనా, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భృతి పెంపుపై నాయీబ్రాహ్మణుల హర్షం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో తలనీనాలకు సంబంధించి విధులు నిర్వర్తించే నాయీ బ్రాహ్మణులకు కనీస వేతనం రూ.25 వేలు పెంచుతూ కూటమి ప్రభుత్వం జీవో జారీ చేయడంతో నాయి బ్రాహ్మణులు హర్షం వ్యక్తం చేస్తున్నారని నాయి బ్రాహ్మణ సాధికార కడప పార్లమెంట్ అధ్యక్షుడు గజ్జల గోవిందు తెలిపారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ఆలయాల్లో నాయి బ్రాహ్మణులకు మేలు చేసే విధంగా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ఆనందదాయకమని తెలిపారు. గతంలో నెలవారి భృతి రూ . 20 వేలు ఉండగా దాన్ని చంద్రబాబు ప్రభుత్వం రూ.25 వేలు పెంచడం శుభపరిణామమని పేర్కొన్నారు. త్వరలోనే రాష్ట్రంలోని అన్ని బార్బర్ షాప్‌లకు 200 యూనిట్ల వరకు ఉచితంగా కరెంటును అందించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఆదరణ –3 పథకం ద్వారా చేతివృత్తులకు పనిముట్లను అందించే విధంగా విధివిధానాలు తయారు చేసి పంపించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో కడప నాయి బ్రాహ్మణ సాధికార కమిటీ సభ్యుడు దేవగుడి సుబ్బరాయుడు, జమ్మలమడుగు నాయి బ్రాహ్మణ కమిటీ సభ్యుడు లక్ష్మీనరసయ్య పాల్గొన్నారు.

ఫీజుల ఒత్తిడిని ఆపాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఖాజీపేట

ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల్లో పరీక్షలు జరుగుతున్న దృష్ట్యా ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారని, వేధింపులకు పాల్పడుతున్న కళాశాల యాజమాన్యా లపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాహుల్, ఉపాధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఖాజీపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశం మాట్లాడుతూ. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల కోసం ఒత్తిడి చేస్తున్న కళాశాల వారిపై విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో అభినయ్ పాల్గొన్నారు.

సిఎస్ఐ చర్చి 50వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని కేతవరం సిఎస్ఐ చర్చి 50వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాయలసీమ డైయసిస్ సెక్రటరీ సాల్మన్, సంఘ గురువు రాజేంద్రబాబు హాజరయ్యారు.చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపి టిసి జయరాజు, వైసిపి క్రిస్టియన్ మైనారిటీ సెల్ మైదుకూరు కన్వీనర్ బాబ్జీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, NOOKALA UMADEVI (Aadhar No.2082 5044 0508), W/o JONNADULA Venkata Siva Prasad, Resident No.4/4, Venkateswarapuram,Madhavaram-1, Peddapalle, Cuddapah. A.P-516 247, India. Have Changed My Name From. **J.UMADEVI (old) to NOOKALA UMA DEVI (New Name).**

IN THE COURT OF THE HON'BLE MACT-CUM- IV ADDITIONAL DISTRICT JUDGE, KADAPA

M.V.O.P.NO. 210/2024

1. Shaik Hussen bee, W/o. Shaik Basha aged about 55 years, house wife, 2. Shaik Basha, s/o. Hussen saheb, aged about 58 years, un-employee, Both are resident of Krishnapuram village, C.K Dinne mandal, YSR District. **...Petitioners/Claimants**

Vs

1. M.Jaya rani, w/o. B.Gopal reddy, vehicle owner resident of d.no. E/34- 210, Chinnachowk, Kadapa City. **...Respondent No.2**

NOTICE

The above referred the claimants have filed for compensation case in M.V.O.P No. 210/2024, in the above court and same is posted for your appearance on 23.05.2025, at 10:30 A.M, if you're not appear before the Hon'ble Court, the Hon'ble court will take appropriate steps against you in your absence.

//By Order of the Hon'ble Court//

G.VENKATESWARA REDDY

Advocate, KADAPA.

IN THE COURT OF THE HON'BLE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE, KADAPA

E.P. No. 308/2022

OS. No. 881/2020

M. Sanjeeva Kumar, S/o Sanjeeva Rayadu, R/o Nakash Street, Kadapa City. **...DHR/Plaintiff**

Vs

1) Shaik Mahaboob Basha, S/o Mahaboob Sharif
2) Shaik Ghouse Peer, S/o Mahaboob Sharif
3) Shaik Moulali, S/o Mahaboob Sharif
All are residing at D.No. 14/678-2-1, Nakash Street, Kadapa City, YSR Dist. **...JDR's/defendants**

NOTICE

Whereas in the above mentioned suit the decree-holder has applied for sale of schedule property. You are hereby informed that the 19th day of June 2025 has been fixed for setting the terms of proclamation of sale.

//By Order of the Hon'ble Court//

G.VENKATESWARA REDDY

Advocate, KADAPA.

IN THE COURT OF HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, PRODDATUR

O.S.No. 578 /2021

Korrapati Mohan Reddy, S/o.Late Korrapati Lakshmi Reddy, aged about 53 years, Hindu, Business, R/o.D.No.2-555, Sastri Nagar, Proddatur Town and Mandal-516360, YSR Kadapa District. **...Plaintiff**

Vs

Shaik Nawaj, S/o. Shaik Munaf Basha, aged about 38 years, Muslim, Business, R/o.D.No.14/52, Srinivasapuram-516361, Gopavaram Panchayat, Defendant PRODDATUR MANDAL, YSR Kadapa District. **...Defendant**

SUMMONS TO DEFENDANT

పై వాది ప్రతివాదివి అయిన నీవు వ్రాయించి ఇచ్చిన 17.09.2018 తేది నాటి విక్రయ అగ్రిమెంటు రీత్యా నీవు తీసుకున్న Earnest Amount Rs.4,09,000/- మరియు 24% P.A. ప్రకారం అయిన వడ్డీ రూ.2,93,662/– వెరశి రూ.7,02,662/– Future Interest మరియు కోర్టు ఖర్చులు కలిపి చెల్లించాలని పై దావా దాఖలు చేశాడు. అట్టి పై దావాలో నీవు 06.05.2025వ తేదీన పై కోర్టు నందు ఉ॥10.30 గంటలకు హాజరయ్యి నీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనంతట పై దావా నీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది: 06.05.2025

//కోర్టు ఉత్తర్వుల మేరకు//

వి. రమేష్‌బాబు

అడ్వకేట్, ప్రొద్దుటూరు.

సెల్: 9441500950.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE, AT PRODDATUR

O.S.No. 52/2024

Guddeti Srinivasa Reddy. Having died his L.Rs 1 to 3
1.Guddeti Padmavathi, aged about 48 years, W/o. Late Guddeti Srinivasa Reddy, Hindu, Household duties, R/o.D.No.26/1/22, Kapu Street, KANNELURU VILLAGE-JAMMALAMADUGU MANDAL-516434, Aadhar Number : 7557 9790 0267. Mobile Number:7416116076.
2.Guddeti Sai Kiran Reddy, aged about 30 years, S/o.Late.Guddeti Srinivasa Reddy, Hindu, Student, R/o.D.No. 26/1/22, Kapu Street, KANNELURU VILLAGE-JAMMALAMADUGU MANDAL-516434, Aadhar Number : 9313 9500 2316. Mobile Number: 7416116076.
3. Guddeti Anusha, aged about 27 years, D/o. Late. Guddeti Srinivasa Reddy, Hindu, Student, R/o.D.No. 26/1/22, Kapu Street, KANNELURU VILLAGE- JAMMALAMADUGU MANDAL-516434, Aadhar Number: 9884 3861 8656. Mobile Number : 7416116076. **...Plaintiffs**

Vs

1.Marthala Muni Reddy and 6 others. **...Defendants**

SUMMONS AND NOTICE TO D4/R4

D4/R4:. Guddeti Venkata Rami Reddy, aged about 50 years, S/o.Late Guddeti Konda Reddy, Hindu, Business, R/o. 26/1/22, Kapu Street, KANNELURU VILLAGE-JAMMALAMADUGU MANDAL-516434, Aadhar Number: 9272 0036 6106.Mobile Number: 9603603396.

పై దావాలో 4వ ప్రతివాది మరియు I.A.No.1010/2024 4వ రెస్పాండెంట్ అయిన నీవు 07.05.2025వ తేదీన ఉ॥10.30 గం॥లకు పై కోర్టు నందు హాజరయ్యి నీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనంతట పై దావా మరియు I.A.No.1010/2025 టెంపరరీ ఇంజక్షన్ పిటిషన్ నీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది: 07.05.2025

//కోర్టు ఉత్తర్వుల మేరకు//

వి. రమేష్‌బాబు

అడ్వకేట్, ప్రొద్దుటూరు.

సెల్: 9441500950.

మహారాజరాజశ్రీ మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు, కడప

O.S.No. 599/2020

మద్దిరాల సిద్ధయ్య, తండ్రి యం.వెంకటరాములు, ఇండియన్, హిందూ, వయస్సు 42 సంవత్సరములు, వ్యాపారం, డోర్‌నెం.11/206–6, కాగితాలపెంట, కడప టౌన్, వై.యస్.ఆర్.జిల్లా. **...వాది**

Vs

1. యస్.షేక్‌షావల్లి తండ్రి సయ్యద్ ఇస్మాయిల్, ఇండియన్, ఇస్లాం, వయస్సు 60 సం॥, హావింగ్ డైడ్ రెప్రజెంటెడ్ బై లీగల్ హెర్స్.
2. శ్రీమతి యస్.షమీమ్,భర్త యస్.షేక్‌షావల్లి, ఇండియన్, ఇస్లాం, వయస్సు 58 సం॥.
3. యస్.బురాదీన్, తండ్రి యస్.షేక్‌షావల్లి, ఇండియన్, ఇస్లాం, వయస్సు 31 సం॥.
4. యస్.గౌస్ మొహిద్దీన్, తండ్రి యస్.షేక్‌షావల్లి, ఇండియన్, ఇస్లాం, వయస్సు 29 సం॥.
5. యస్.బాను, తండ్రి యస్.షేక్‌షావల్లి, ఇండియన్, ఇస్లాం, వయస్సు 27 సం॥.
6. యస్.రఖీబీ,తండ్రి యస్.షేక్‌షావల్లి, ఇండియన్, ఇస్లాం, వయస్సు 24 సం॥.
7. యస్.మౌలాలి, తండ్రి యస్.షేక్‌షావల్లి, ఇండియన్, ఇస్లాం, వయస్సు 23 సం॥.
8. యస్.మునీఫ్, తండ్రి యస్.షేక్‌షావల్లి, ఇండియన్, ఇస్లాం, వయస్సు 31 సం॥లు, ప్రైవేట్ ఉద్యోగి.

రెస్పాండెంట్స్ నెం.2 నుండి 7 రిసైడింగ్ అట్ డోర్‌నెం. 8/95–3, ప్రకాశ్‌నగర్, కడప టౌన్, కడప జిల్లా. **...ప్రతివాదులు**

ప్రతివాదులు నెం.5,6,7,8 కు సమన్లు

పిటీషనర్ అయిన మద్దిరాల సిద్ధయ్య పై రాజశ్రీ వారి కోర్టులో మీరు ప్రతివాదులుగా బాకీ వసూలు నిమిత్తమై దాఖలు చేసిన దావాలో ఓ.యస్.నెం.599/2020 నందు మీ హాజరు నిమిత్తమై 23.06.2025 వాయిదా కలదు. కనుక మీరు స్వయంగా కాని, వకీలు ద్వారా కాని పైరాజశ్రీ గారి కోర్టులో 23.06.2025వ తేదీన ఉదయం గ॥10.30 ని॥కు హాజరై మీ అభ్యంతరములు తత్ సంబంధిత దస్తావేజులతో లిఖిత పూర్వకంగా తెలియజేయవలయును. లేనంతట పైకేసు మీ పరోక్షములో తీర్మాణించబడునని తెలియజేయడమైనది.

//కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

టి.వి.యస్.యస్.మూర్తి, అడ్వకేట్–నోటరి

మహారాజరాజశ్రీ మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు, కడప

I.A.No. 762/2020 In O.S.No. 599/2020

మద్దిరాల సిద్ధయ్య, తండ్రి యం.వెంకటరాములు, ఇండియన్, హిందూ, వయస్సు 42 సంవత్సరములు, వ్యాపారం, డోర్‌నెం.11/206–6, కాగితాలపెంట, కడప టౌన్, వై.యస్.ఆర్.జిల్లా. **...పిటీషనర్/వాది**

Vs

1. యస్.షేక్‌షావల్లి తండ్రి సయ్యద్ ఇస్మాయిల్, ఇండియన్, ఇస్లాం, వయస్సు 60 సం॥, హావింగ్ డైడ్ రెప్రజెంటెడ్ బై లీగల్ హెర్స్.
2. శ్రీమతి యస్.షమీమ్,భర్త యస్.షేక్‌షావల్లి, ఇండియన్, ఇస్లాం, వయస్సు 58 సం॥.
3. యస్.బురాదీన్, తండ్రి యస్.షేక్‌షావల్లి, ఇండియన్, ఇస్లాం, వయస్సు 31 సం॥.
4. యస్.గౌస్ మొహిద్దీన్, తండ్రి యస్.షేక్‌షావల్లి, ఇండియన్, ఇస్లాం, వయస్సు 29 సం॥.
5. యస్.బాను, తండ్రి యస్.షేక్‌షావల్లి, ఇండియన్, ఇస్లాం, వయస్సు 27 సం॥.
6. యస్.రఖీబీ,తండ్రి యస్.షేక్‌షావల్లి, ఇండియన్, ఇస్లాం, వయస్సు 24 సం॥.
7. యస్.మౌలాలి, తండ్రి యస్.షేక్‌షావల్లి, ఇండియన్, ఇస్లాం, వయస్సు 23 సం॥.
8. యస్.మునీఫ్, తండ్రి యస్.షేక్‌షావల్లి, ఇండియన్, ఇస్లాం, వయస్సు 31 సం॥.

రెస్పాండెంట్స్ నెం.2 నుండి 7 రిసైడింగ్ అట్ డోర్‌నెం. 8/95–3, ప్రకాశ్‌నగర్, కడప టౌన్, కడప జిల్లా. **...రెస్పాండెంట్స్/డిఫెండెంట్స్**

ప్రతివాదులు నెం.5,6,7,8 కు నోటీసులు

పిటీషనర్ అయిన మద్దిరాల సిద్ధయ్య గారు పై రాజశ్రీ వారి కోర్టులో మీరు ప్రతివాదులుగా బాకీ వసూలు నిమిత్తమై దాఖలు చేసిన దావాలో ఐ.ఏ.నెం.762/2020 ఇన్ ఓ.యస్.నెం.599/2020 నందు మీ హాజరు నిమిత్తమై 23.06.2025 వాయిదా కలదు. కనుక మీరు స్వయంగా కాని, వకీలు ద్వారా కాని పైరాజశ్రీ గారి కోర్టులో 23.06.2025వ తేదీన ఉదయం గ॥10.30 ని॥కు హాజరై మీ అభ్యంతరములు తత్ సంబంధిత దస్తావేజులతో లిఖిత పూర్వకంగా తెలియజేయవలయును. లేనంతట పై కేసు మీ పరోక్షములో తీర్మాణించబడునని తెలియజేయడమైనది.

//కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

టి.వి.యస్.యస్.మూర్తి, అడ్వకేట్–నోటరి